శ్రీవారి హుండీ లెక్కింపు



అల్వాల్: అల్వాల్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయం హుండీని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు పర్యవేక్షణలో లెక్కించారు. 50 రోజులకు రూ.1,64,523 ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ రాజాసంజయ్ గోపాల్ సైంచర్, ఈవో ఎం.వీరేశం, స్థానిక జేఏసీ నాయకులు సురేందర్‌రెడ్డి, భక్తులు బీవీ.రాం చందర్‌రావు, శివరామకృష్ణ, రామారావు, మూర్తి, వసంత, నిర్మల, కవిత, రోహిణి, లావణ్య, వినోద, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా ఖోఖో టీమ్‌కి సుప్రియ



సుప్రియకు నగదు అందజేస్తూ..

మల్లాపూర్: మల్లాపూర్ ఎంహెచ్ఎస్ స్పోర్ట్స్ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న 9వ తరగతి విద్యార్థిని ఎం.సుప్రియ తెలంగాణ ఖోఖో అసోసియేషన్ సీనియర్ బాలికల టీమ్‌కి తెలంగాణ తరఫున ఢిల్లీలో జరుగుతున్న ఖేలో ఇండియా పోటీలకు ఖోఖో టీమ్‌కు సెలక్ట్ అయ్యింది. ఢిల్లీ వెళ్లడానికి స్తోమత లేని కారణంగా కోచ్ నరేందర్ ద్వారా ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్‌ను సంప్రదించగా వెంటనే ఫౌండేషన్ అధ్యక్షుడు నాగమోహన్ స్పందించి ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.3,500 నగదు అందజేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు, మోడ్రన్ స్కూల్ పాఠశాల చైర్మన్ ముత్యంరెడ్డి, కోచ్ నరేందర్ నాగమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాసులిస్తే కట్టుడు.. లేకుంటే కూల్చుడే..

- జవహర్‌నగర్‌లో వందలాది అక్రమ అంతస్తులు
- పేదల ఇళ్లను వెంటనే కూల్చేస్తున్న అధికారులు
- అక్రమ బహుళ అంతస్తులకు నోటీసులతోనే సరి
- మున్సిపల్, రెవెన్యూ అధికారుల లీలలు
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- కలెక్టర్ స్పందించాలని స్థానికుల వేడుకోలు



ఇంటిని కూల్చేస్తున్న అధికారులు



జవహర్‌నగర్‌లో కొనసాగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణం

జవహర్‌నగర్: మేడ్చల్ జిల్లాలోని జవహర్‌నగర్‌లో ఇళ్ల నిర్మాణాల పేరుతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు భారీగా జేబులు నింపుకుంటున్నారు. కాసులిస్తే కళ్లు మూసుకుంటారు.. లేదంటే అక్రమ నిర్మాణాల పేరుతో పేదల ఇళ్లపై తమ ప్రతాపాన్ని చూపుతున్నారు. కూలీ నాలీ చేసుకుని కూడబెట్టిన డబ్బులతో ఒకటి రెండు గదులను నిర్మించుకుంటే రెవెన్యూ అధికారులు జేసీబీల సహాయంతో నేలమట్టం చేస్తున్నారు. డబ్బులు ఇచ్చుకునే స్తోమత లేదంటే ఇళ్లు కోల్పోవాల్సి వస్తోందని పేదలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాసులు ఇచ్చిన వారి ఇళ్ల నిర్మాణాలను సెలవు దినాల్లో పనిచేసుకోవాలని వారికి సలహా ఇస్తున్నారు. మూటలు ముట్టజెప్పని పేదల ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతుంటే అక్రమ నిర్మాణాలంటూ అటు రెవెన్యూ, ఇటు మున్సిపల్ అధికారులు దగ్గరుండి మరీ కూల్చివేయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ తహసీల్దార్లుగా విధులు నిర్వర్తించిన గౌతమ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, నాగమణిల హయాంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించాలంటే కబ్జాదారులు భయభ్రాంతులకు గురయ్యేవారు. ప్రస్తుత తహసీల్దార్ సుచరిత, ఆర్ఐ శ్రీలక్ష్మి కాప్రా మండలంలోనే ఎక్కువ సమయాన్ని కేటాయించడంతో ఆ సమయాన్ని ఆసరా చేసుకుని వందలాది బహుళ అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

తొందరగా సున్నం వేసుకోండి..

జవహర్‌నగర్‌లో నిర్మించిన అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలకు అధికారులే అండగా ఉంటున్నారు. కార్పొరేషన్ కార్యాలయం చుట్టుపక్కన పదుల సంఖ్యలో అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని రోజులుగా నిర్మించిన అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తే అధికారులు తూతూ మంత్రంగా వచ్చి నోటీసులు ఇచ్చి పోవడం అలవాటుగా మారింది. ఎవరైనా అక్రమ నిర్మాణాల గురించి అడిగితే నోటీసు అందించాం అని చెప్పడం మొదలుపెట్టారు. మేము నోటీసులు అందిస్తాం.. మీరు సున్నం వేసుకోండని చెప్పడం పరిపాటిగా మారిపోయింది. ఒకవేళ ఎవరైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా మేము వచ్చేలోపు సున్నం వేసుకుని ఇంట్లో ఉండండి.. మేము జేసీబీ తీసుకుని వచ్చి ఫొటో తీసుకుని వెళ్లిపోతామని ఫోన్ చేసి మరీ వివరిస్తున్నారు.

పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారి..

సిద్దిపేటలో టౌన్‌ప్లానింగ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రవంతికి ఏడాదిన్నర క్రితం జవహర్‌నగర్‌లో అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె ఆ రోజు నుంచి మూడు రోజులు జవహర్‌నగర్‌లో మరో మూడు రోజులు సిద్దిపేటకు వెళ్తుంది. ఆమె విధుల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జవహర్‌నగర్‌లో అక్రమంగా నిర్మించిన దాదాపు 30 నుంచి 40 బహుళ అంతస్తులకు నోటీసులు అందించారు. వాటిలో ఏ ఒక్క అక్రమ భవనంపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పేరుకే టీపీవోగా ఉండి నోటీసులు మాత్రం జారీ చేసి చేతులు దులుపుకుంటోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి జవహర్‌నగర్‌లో అక్రమంగా వెలసిన బహుళ అంతస్తుల నిర్మాణలతో పాటు మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసులపై పూర్తి స్థాయి విచారణ చేస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వందలాది బహుళ అంతస్తుల నిర్మాణాలు..

జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా వందలాది అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలిశాయి. వీటిలో అప్పటి బీఆర్ఎస్, తాజాగా కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకుల ఇళ్లు ఉన్నాయి. అధికారులు ఆ నిర్మాణాలకు కేవలం పోలీసు బలగాలతో వచ్చి నోటీసులు అంటించి వెళ్లిపోవడం తప్ప చేపట్టిన చర్యలు శూన్యం. నోటీసులు తీసి పడేసి వారు నిర్మాణాలను పూర్తి చేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

అక్రమ నిర్మాణాలు చేపట్టి ... అధికార పార్టీవైపు వచ్చి ..

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారనే కొంతమంది బీఆర్ఎస్ నుంచి అధికార పార్టీలోకి కండువా మార్చినట్లు గుసగుసలాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నయానో, భయానో అధికారులకు ముట్టజెప్పి వారి అక్రమ నిర్మాణాలను పూర్తిచేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కళాశాలలపై చర్యలు తీసుకోవడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చాలా మంది కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు అధికార పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే వారు నిర్మించిన అక్రమ నిర్మాణాలకు కాంగ్రెస్ పెద్దలు అండగా నిలబడి వాటిని కాపాడతారా లేక చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే..



కార్పొరేషన్‌కు సమీపంలోని ఓ బహుళ అంతస్తుకు నోటీసులు పెడుతున్న అధికారులు

చర్యలు తీసుకుంటాం..



జవహర్‌నగర్‌లో ఇంటి నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. ప్రధాన రహదారి ఆనుకుని నిర్మించిన అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటి వరకు కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులు అందించిన నోటీసులను పరిశీలించి విచారణ చేపడతాం. మున్సిపల్ అధికారులు తప్పు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్ని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నాం. మిగిలిన వాటిపై చర్యలు తీసుకుంటాం.

– తాజ్ మోహన్‌రెడ్డి, కమిషనర్, జవహర్‌నగర్

ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా గణేష్ గౌడ్



గణేష్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న కిషోర్‌కుమార్

మల్లాపూర్: ఎన్ఎస్‌యూఐ మల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఓల్డ్ మల్లాపూర్‌కు చెందిన గుడిసె గణేష్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షుడు కిషోర్‌కుమార్ చేతులమీదుగా నియామక ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా గణేష్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కప్పర సాయి, కోయిగూర బాలరాజ్, మెరుపుల బాలరాజ్, గుడిసె సాయి, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జయంత్ ఉపాధ్యక్షులు వినీష్, సాయి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార కార్యాచరణపై చర్చ



ప్రొఫెసర్ కోదండరాంతో నాయకులు

అల్వాల్: తెలంగాణ జన సమితి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నాయకులు మంగళవారం తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాబోయే పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యాచరణపై వారు చర్చించారు. జిల్లా నాయకులు ఏర్పుల దయాకర్, రెడ్డిపల్లి శ్రీనివాస్, మారం లక్ష్మారెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు.. గాలిబుడగలు



నాచారంలో ఆత్మీయ సమ్మేళన సమావేశంలో మాట్లాడుతున్న ఈటల జమున

మల్లాపూర్: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు గాలిబుడగ లాంటివని, రాష్ట్రంలో వాటికి భవిష్యత్ లేదని గతం గురించి మాట్లాడటం తప్ప భవిష్యత్ గురించి మాట్లాడే శక్తి వారికి లేదని బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున అన్నారు. నాచారంలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ మహిళా ఆత్మీయ సమ్మేళనం సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ భవిష్యత్ లేని పార్టీలన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభివృద్ధి చెందాలంటే కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మల్కా ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, మహిళా కన్వీనర్స్ అనితారెడ్డి, మంజుల వాణి, నవీన్, అశోక్, శ్రీధర్‌రెడ్డి, దయాగౌడ్, యేగేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి, గోపి, నవీన్‌గౌడ్, లావణ్య అరుణ, శేఖర్, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నా భర్తను గెలిపించాలి

రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రజిని



నాచారం కార్పొరేటర్‌తో రాగిడి రజిని

మల్లాపూర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రజిని కోరారు. నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో కలిసికట్టుగా ఎలా పనిచేశారో.. అదేవిధంగా రాగిడి గెలుపు కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాగిడి మౌనిక, అంజలి, ప్రీతిరెడ్డి, బాలమణి, ఆదిలక్ష్మి, సువర్ణ, కామేశ్వరి, లక్ష్మి, సుజాత, జయమ్మ, భారతమ్మ, సుజాత తదితరులు ఉన్నారు.

పోలింగ్ సిబ్బందికి విధుల కేటాయింపు

సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది మొదటి రాండమైజేషన్ పూర్తిచేసినట్లు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ వీసీహాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో మంగళవారం కలిసి ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజెషన్ ప్రక్రియను ఆయన పూర్తి చేశారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, 2,425 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 13,226 మంది సిబ్బందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు ఉన్నారన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా నియమించిన వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచేలా అవగాహన కార్యక్రమాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ నమోదైన గ్రామాల్లో మహిళా స్వయం సంఘాల ప్రతినిధులతో కారణాలను తెలుసుకుని పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో మహిళా సమాఖ్యలు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా 5కే రన్ ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. పలుచోట్ల మానవహారం కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో విద్యార్థుల్లో ఓటు హక్కుపై అవగాహన పెంచేలా ఓటు నమోదు చేసుకునేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. మేడ్చల్, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటింగ్ అవగాహన కార్యక్రమంలో డీఆర్‌డీఏ సాంబశివరావు, డీపీఎంలు శీలం ప్రభాకర్, సురేఖ, ఉద్యోగులు చిక్కుడు సంతోష్ కుమార్, తావుర్యానాయక్, బలరాం, జయంత్, ఏపీయంలు, సీసీలు, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధోబీఘాట్ సమస్యల పరిష్కారానికి కృషి



జ్యోతినగర్ ధోబీఘాట్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పర్యటించారు. జ్యోతినగర్ ధోబిఘాట్‌లోని వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రజక సంఘం నేతలతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జ్యోతినగర్ ధోబీఘాట్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. చాకలి ఐలమ్మ విగ్రహం తొలగించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. అదేవిధంగా కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్, జవహర్‌నగర్ కార్పొరేటర్ మురుగేష్, జేఏసీ నేత వెంకన్న, నాయకులు మల్లేష్‌యాదవ్, నర్సింగ్‌రావు, పరమేష్, రజక సంఘం నాయకులు సత్యనారాయణ, కాసర్ల నాగరాజు, యాదగిరి, కిరణ్, శ్రీకాంత్, తిరుపతి, లక్ష్మణ్, శంకర్, సతీష్, ప్రవీణ్, మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మేడ్చల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ నుంచి ద్విచక్రవాహనంపై మేడ్చల్ వస్తున్న ఓంప్రకాష్(23) అయోధ్య చౌరస్తా వద్ద లారీని ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం

ఘట్‌కేసర్: వేర్వేరు చోట్ల అక్రమంగా విక్రయిస్తున్న మద్యం, నగదును ఘట్‌కేసర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అడ్మిన్ ఎస్ఐ రాములునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మైసమ్మగుట్టలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నర్రి మైసమ్మ బెల్ట్ దుకాణంపై దాడి చేసి 30 కేకే విస్కి బాటిల్స్, 6 ఆఫీసర్ ఛాయిస్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఈడబ్ల్యూఎస్ కాలనీలో..

పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో మద్యం విక్రయిస్తున్న పంజాల బాల్‌లక్ష్మీ ఇంటిపై దాడి చేసి 20 క్వాటర్ కేకే విస్కి, 10 ఆఫీసర్స్ ఛాయిస్, 15 ఆఫీసర్ ఛాయిస్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంకుషాపూర్‌లో డీజే నిర్వహించిన రిసార్ట్‌పై కేసు

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో విలేజ్ ట్రయల్స్ రిసార్ట్ నిర్వాహకులు అనుమతి లేకుండా డీజేతో ఈవెంట్ నిర్వహించినందుకు నిర్వాహకులపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హోలీ పండగను పురస్కరించుకొని అంకుషాపూర్ విలేజ్ ట్రయల్స్ రిసార్ట్ నిర్వాహకులు డీజే ఏర్పాటు కోసం పోలీసుల అనుమతి కోరారు. పోలీసులు అనుమతి నిరాకరించారు. అనుమతి లేకున్నా రిసార్ట్ నిర్వాహకులు డీజేతో పాటు లౌడ్ స్పీకర్లు, బ్యాండ్‌తో ఈవెంట్ నిర్వహించారు. శబ్ద కాలుష్యం గుర్తించిన పోలీసులు అనుమతి లేకుండా డీజే బ్యాండ్‌తో ఈవెంట్ నిర్వహిస్తున్న నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కామ్రేడ్ సుధాకర్‌కు నివాళి



కామ్రేడ్ సుధాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తూ..

అల్వాల్: ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ అధ్యక్షతన మంగళవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద మున్సిపల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ ఏఐటీయూసీ అల్వాల్ కమిటీ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ సుధాకర్ సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమానికి భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ బాల మల్లేష్ హాజరై సుధాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్ సుధాకర్ అకాల మరణం పార్టీకి, ట్రేడ్ యూనియన్‌కి తీరని లోటన్నారు. కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడంలో ముందుండేవారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి, కార్యదర్శి శ్రీనివాస్, అనగారిన హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి సీఎల్.యాదగిరి, హరినాథ్, శేఖర్, శివశంకర్, శ్రీను, తిరుపతి, రాజు, పారిశుద్ధ్య కార్మికులు యాదమ్మ, మల్లుబాయ్, పెంటమ్మ పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలబడేది సీపీఐ



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మహిళలు

పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్

బోడుప్పల్: సీపీఐ.. పేదల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ అన్నారు. బోడుప్పల్‌లో మంగళవారం నిర్వహించిన హేమానగర్ శాఖ సమావేశం, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదుకు కార్మికులు, కర్షకులు, వివిధ రంగాల్లో ప్రైవేట్ సెక్టార్‌లో పని చేస్తున్న ఉద్యోగుల నుంచి స్పందన లభిస్తోందన్నారు. పేదల పక్షాన నిలబడి, పేదల కోసం సీపీఐ పని చేస్తుందన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై నిత్యం పోరాటం చేస్తూ పేదల కోసం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, నాయకులు ఉప్పల కొమరయ్య, నాగరాజు, మామిళ్ల అనిత, సురిగ్గ కవిత, యాదమ్మ, అండాలు, మల్లమ్మ, అంజమ్మ, మమత, మంజుల, యాదయ్య, అనిత పాల్గొన్నారు.

ఘనంగా జ్ఞానసరస్వతీదేవి బ్రహ్మోత్సవాలు



అలంకరణలో అమ్మవారు



సరస్వతీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మల్కాజిగిరి: అనంత సరస్వతీ నగర్‌లోని జ్ఞాన సరస్వతీ దేవి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు దేవతా మూర్తులకు అభిషేకం, సుబ్రహ్మణ్యస్వామి, సరస్వతీ దేవి హోమం, సహస్ర కుంకుమార్చన, రాత్రి పల్లకీ సేవ అర్చకులు రాజశేఖరశర్మ, గురురాజ, సాయిలు నిర్వహించారు.

నేడు శతఘటాభిషేకం

చివరిరోజు బుధవారం అమ్మవారికి శతఘటాభిషేకం, లక్ష పుష్పార్చన, పూర్ణాహుతి, అన్న సమారాధన, రాత్రి ఊరేగింపు, పల్లకీ సేవతో ముగుస్తాయని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి

జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ, మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణతో తాగునీటి సమస్యను అధిగమించాలన్నారు. కలెక్టరేట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నీటి ఎద్దడి నివారణ, వరి కోతలు, ఎన్నికల కోడ్ అమలు తదితర విషయాలపై మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంటుందని తెలిపారు. అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం చేయాలని, ప్రజా ప్రతినిధులు పాల్గొనవద్దని తెలిపారు.

గోదాం స్థలం కోసం కృషి

ఘట్‌కేసర్: రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించడానికి గోదాం స్థలం కోసం కృషి చేస్తామని జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని నారాయణ గార్డెన్‌లో రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన అర్ధ వార్షిక మహాసభకు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రైతులకు బీమా చేయించడం భారంతో కూడుకున్నదని అన్నారు. సంఘానికి నాబార్డు రుణం కోసం ప్రయత్నిద్దామని, మన సంఘాన్ని మనమే అభివృద్ధి చేసుకోవాలన్నారు. సమస్యలుంటే సంఘం కార్యాలయంలో చర్చించుకోవాలని రైతులకు సూచించారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వారికి తెలియనివ్వడం లేదని, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం లేదన్నారు.

ఉచిత పథకాలు తొలగించాలి..

ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచితంగా అందజేస్తున్న గొర్లు, బర్లతో ఒరిగేమీ లేదని, అవి అందగానే విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులకు చిత్తశుద్ధి ఉంటే రైతులకు సబ్సిడీ ఇవ్వాలని, లేనిపక్షంలో సంఘం దివాళా తీస్తుందన్నారు. యూబీఐ డిప్యూటీ రీజినల్ హెడ్ రఘునాథ్‌రెడ్డి, రాష్ట్ర సహకార సంఘం డిప్యూటీ రిజిస్ట్రార్ సురేఖ రాణి, యూబీఐ చీఫ్ మేనేజర్ వివేక్, మేనేజింగ్ డైరెక్టర్ కరుణాకర్, సంఘం వైస్ చైర్మన్ అనంతరెడ్డి ఉన్నారు.